

## జగిత్యాలలో దసరా జోష్

జగిత్యాల జిల్లా కేంద్రంలో దసరా సంబురం అంబరాన్నంటింది. సోమవారం జంబిగద్దె వద్ద నిర్వహించిన శమీపూజోత్సవానికి పట్టణ నలుమూలల నుంచి ప్రజానీకం తరలివచ్చింది. అదే సమయంలో శ్రీవేణుగోపాలస్వామి వారి పల్లకీ సేవ నిర్వహించగా, ఆద్యంతం కనులపండువగా సాగింది. ఈ సందర్భంగా భక్తులు జమ్మి కొమ్మలను కత్తిరించి జమ్మికొట్టుడు కార్యక్రమాన్ని ముగించగా, ఎక్కడా ఇబ్బందులు రాకుండా పోలీసు శాఖ బందోబస్తు చేపట్టింది.

– జగిత్యాల టౌన్, అక్టోబర్ 24



జగిత్యాలటౌన్: కృష్ణానగర్‌లోని సాయి ఆలయంలో సాయి బాబాకు పాలాభిషేకం చేస్తున్న జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్‌కుమార్

## కనులపండువగా సాయిబాబా పుణ్యతిథి

కోరుట్ల/ జగిత్యాలటౌన్, అక్టోబర్ 24: షిర్డీ సాయిబాబా 105వ పుణ్యతిథి వేడుకలు వైభవంగా జరిగాయి. కోరుట్ల, జగిత్యాల సాయిబాబా ఆలయాల్లో అంబరాన్నంటాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు, బాబా దర్శనం కోసం బారులు తీరగా, భక్తుల 'సాయి' నామస్మరణతో ఆలయ పరిసరాలు పులకించిపోయాయి. కోరుట్ల పట్టణంలోని ఆలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ కల్వకుంట్ల, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, సరోజన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానాన్ని ప్రారంభించి భక్తులకు వడ్డించారు. అలాగే జగిత్యాలలోని కృష్ణానగర్ సాయిబాబా, శ్రీగుట్ట రాజరాజేశ్వరస్వామి ఆలయాల్లో జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే ఎం సంజయ్‌కుమార్ పూజలు చేశారు. బాబా విగ్రహాలకు పాలాభిషేకం చేశారు.



కోరుట్ల: సాయిబాబా ఆలయంలో అర్చకుల ఆశీర్వాదం తీసుకుంటున్న కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, సరోజన దంపతులు

# హ్యాట్రిక్ విజయం మనదే



పెగడపల్లిలో దళిత సంఘాల నాయకులతో ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్

- అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్‌ను గెలిపిస్తుంది
- రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్
- పెగడపల్లిలో ఎన్నికల ప్రచారం.. కుల సంఘాలతో సమావేశం
- కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులకు పార్టీలోకి ఆహ్వానం

పెగడపల్లి, అక్టోబర్ 24: 'వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయం. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి. కాంగ్రెస్, బీజేపీ పనైపోయింది. వాళ్లకు ఓటమి తప్పదు' అని మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. మంగళవారం పెగడపల్లి మండల కేంద్రంలో మంత్రి కొప్పుల ప్రచారం చేశారు. స్థానిక బస్టాండు వద్ద వాణిజ్య, వ్యాపార సంస్థల యజమానులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అలాగే పలు కుల సంఘాల నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, ఎక్కడా ఇబ్బందులు రాకుండా చూసుకుంటున్నదని మంత్రి చెప్పారు. ప్రతి పక్షాల ఝూటా మాటలతో ఆగంకాకుండా ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌కే మద్దతు పలుకాలని కోరారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పదేండ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించిందని, దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని కొనియాడారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో ఎంతో అద్భుతమని, దేశంలో ఎక్కడా ఇలాంటి పాలన లేదని స్పష్టం చేశారు. ధర్మపురి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టానని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేసి మరొకసారి ధర్మపురి ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం నందగిరి, శాలపల్లిలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన నాయకులు పార్టీలో చేరగా, మంత్రి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర నేత వోరుగంటి రమణారావు, జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్‌రావు, ఎంపీపీ గోళి శోభ-సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్ పాల్గొన్నారు.

## కేసీఆరే మా పెద్ద కొడుకు

- కారు గుర్తే మనకు భరోసా
- కథలాపూర్‌లో వృద్ధుల ఇంటింటా ప్రచారం
- అభినందించిన రాష్ట్ర ప్రజాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



కథలాపూర్‌లో వృద్ధులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రజాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్

కథలాపూర్, అక్టోబర్ 24: 'కేసీఆరే మా పెద్ద కొడుకు. మాకు ఏ లోటూ రాకుండా చూసుకుంటుండు. ప్రతి నెలా మాకు పింఛిని ఇస్తుండు. కేసీఆర్ అచ్చినంకనే అందరి బతుకులు బాగుపడ్డయి. కారు గుర్తే మనకు భరోసా. ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌కే ఓటేయాలని' కథలాపూర్ మండలకేంద్రంలో వృద్ధులు విస్తృత ప్రచారం చేశారు. ఒక బృందంగా ఏర్పడి మంగళవారం ఇంటింటా కలియదిరిగారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తూ, కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. కాగా, వృద్ధులే ఒక బృందంగా ఏర్పడి ఇంటింటా ప్రచారం చేస్తున్నారని, అక్కడే కథలాపూర్‌లో పర్యటనలో ఉన్న రాష్ట్ర ప్రజాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ తెలుసుకొని సంతోషపడ్డారు. వారి వద్దకు వచ్చి మాట్లాడారు. కాగా, వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును గెలిపించుకోవాలని, కేసీఆర్ సారును మళ్లోసారి సీఎం కుర్చీలో కూర్చోబెట్టాలనే ప్రచారం చేస్తున్నట్లు వృద్ధులు పేర్కొనగా, ఆయన అభినందించారు.

### ప్రతి నెలా 4వేల పింఛిని వస్తుంది..

మాకు ఏ జీవనాధారం లేదు. కొడుకులు.. బిడ్డలు పెట్టకున్నా ప్రతి నెలా కేసీఆర్ సార్ నాకు రూ.4 వేల పింఛిని పంపిస్తుండు. ఆ పైసలతోనే రంది లేకుండా బతుకుతున్నం. ఇంతకు ముందు ఉన్నోళ్లు మమ్ముల పట్టించు కోలె. అప్పుడు ఇచ్చినయి ఏ మూల కూ చాలలే. ఇప్పుడు రెండు నెలల నుంచి రూ.4వేల పింఛిని వస్తంది. ఇట్లా అందరూ ఆనందంగా ఉండాలంటే కేసీఆర్ కారు గుర్తుకే ఓటు వేయాలి.

- రాధారపు అమృత, దివ్యాంగురాలు, కథలాపూర్

### రందిలేకుంట బతుకుతున్నం..

సీఎం కేసీఆర్ సారు ఇచ్చే పింఛన్ పైసలతోనే రంది లేకుండా బతుకుతున్నం. నాకు నెలకు రూ.2వేల పింఛిని వస్తంది. కేసీఆర్ సారు వచ్చిన దగ్గరి నుంచి ఎవరికి చేయి చాపకుండా ఉంటున్న. మళ్లీ కేసీఆర్ సారే రావాలని మేమంతా ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేస్తున్నాం. మంచిగా ఆలోచన చేసి కారు గుర్తుకే ఓటు వేయాలి. మన సారునే మళ్లీ గెలిపించుకుందాం.

- మ్యాదరి నర్సు, వృద్ధురాలు, కథలాపూర్

## నృసింహుడి క్షేత్రంలో వైభవంగా విజయదశమి వేడుక

ధర్మపురి క్షేత్రంలో విజయ దశమి వేడుకలు కనులపండువగా జరిగాయి. మంగళవారం ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ముప్పూరు స్వాముల ఉత్సవ మూర్తులను సేవలపై ఉంచి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కెపెల్లి రాజేశ్వరాలయం సమీపంలోని జంబి గద్దె మండపం వద్దకు వచ్చి, శమీ వృక్షం వద్ద పూజలు చేయగా, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై, శమీ ఆకును సేకరించారు.

- ధర్మపురి, అక్టోబర్ 24



శమీ వృక్షం వద్ద పూజలు చేస్తున్న పండితులు



జంబి గద్దె వద్దకు స్వామివారల ఉత్సవ మూర్తులతో ఊరేగింపుగా వెళ్తున్న పట్టణ ప్రజలు